





# మావిగన్‌తోనే రాష్ట్రం అభివృద్ధి

- ఓర్చుకోలేకనే దిగజారుడు వ్యాఖ్యలతో డైవర్షన్ పాలిటిక్స్
- కురసాల కన్నబాబు ఆక్షేపణ



**మద్దిలపాలెం, ఏప్రిల్ 6 ప్రభాతవార్త**

లక్షల కోట్లు ఖర్చుపెట్టి కడుతున్న అమరావతి కంటే తమ అధినేత సూచించిన మావిగన్‌తోనే అభివృద్ధి చెందుతుందని మాజీమంత్రి కురసాల కన్నబాబు అభిప్రాయపడ్డారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఆయన మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, పార్టీ విజయనగరం జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ కుంభా రవిబాబుతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ మావిగన్ మోడల్‌లో పోర్టు, ఎయిర్‌పోర్టు, నేషనల్ హైవేలున్నాయి అవన్నీ అమరావతిలో వేల కోట్లు ఖర్చు పెట్టి కొత్తగా నిర్మించాలి అని అమరావతిని కమ్మరావతి అంటున్నా టీడీపీ ఖండించడం లేదు అని ఆయన తెలిపారు. గేటెడ్ కమ్యూనిటీ అని ఆ పార్టీ నాయకులే అంటున్నారు పని ఆయన ఆరోపించారు. అమరావతి అందరి రాజధాని అని ప్రభుత్వం చెప్పలేకపోతోంది అని మావిగన్ అనగానే చంద్రబాబు డెవలప్‌మెంట్ కారిడార్లు అనుకుంటున్నారని రెండేళ్లగా చంద్రబాబు ఉత్తరాంధ్ర, రాయలసీమ ఊసే ఎత్తలేదు అని ఆయన ఆరోపించారు. ఎమ్మెల్సీ కుంభా రవిబాబు మాట్లాడుతూ ఇన్నాళ్లు అమరావతి తప్ప ఏ ప్రాంతాన్నీ పట్టించుకోని చంద్రబాబు, జగన్ మావిగన్ మోడల్ పరిచయం చేయగానే.. రాష్ట్రంలో డెవలప్‌మెంట్ కారిడార్లు అంటూ హడావుడి చేస్తున్నాడని మండిపడ్డారు. అసలు జగన్ సూచించిన మావిగన్ పేరుకు వ్యతిరేకమా? లేక మచిలీపట్నం, విజయవాడ, గుంటూరులో రాజధాని ఏర్పాటుకు వ్యతిరేకమా అని ఆయన ప్రశ్నించారు. పాలన వదిలేసి మావిగన్ వెంట పడ్డారని మచిలీపట్నం, విజయవాడ, గుంటూరుతో కూడిన (మావిగన్) ప్రాంతాన్ని ఒక కారిడార్‌గా అభివృద్ధి మిగతా 8..లో

### జిల్లా ప్రత్యేకతను చాటిచెప్పేలా
## అభివృద్ధి కార్యాచరణ ఉండాలి..

- *ప్రభుత్వ ప్రాధాన్యతే.. మనందరి ప్రాధాన్యతగా ప్రతి అధికారీ పని చేయాలి*
- *60 సమయం సాధారణ పనులకు, 40 వినూత్న లక్ష్యాల కోసం వెచ్చించాలి*
- *జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ సూచనలు*



**విశాఖపట్నం, ఏప్రిల్ 7, ప్రభాతవార్త**

విశాఖపట్టణం జిల్లాకు ప్రపంచ వ్యాప్తంగా కీర్తి, ప్రతిష్టలు ఉన్నాయని.. ఆ ఖ్యాతి, పేరుకు తగ్గట్టుగానే వినూత్న రీతిలో అభివృద్ధి ప్రాజెక్టులు చేపట్టాలని, ప్రత్యేక కార్యాచరణ రూపొందించి ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ జిల్లా అధికారులను ఉద్దేశించి పేర్కొన్నారు. జిల్లా అభివృద్ధి, ప్రజా సేవల మెరుగుదల, విభాగాల సమన్వయంపై కలెక్టరేట్ మీటింగు హాలులో మంగళవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఈ మేరకు ఆయన కీలక సూచనలు చేశారు. జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, డీఎఫ్వో రవీందర్ ధామతో కలిసి ఆయన వివిధ అంశాలపై కూలంకషంగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ శాఖలు, ప్రతి విభాగం తన పరిధిలోని సమాచారం, సమస్యలు, పురోగతిని అధికారులు నేరుగా తనకు తెలియజేయాలని, మధ్యవర్తుల ద్వారా కాకుండా నేరుగా కమ్యూనికేషన్ కొనసాగించాలని, అవసరమైతే మిగతా 8..లో

## ప్రపంచంలోనే గొప్ప విశ్వవిద్యాలయంగా ఏయు నిలవాలి

- *ఎంపి ఎం.శ్రీభరత్ - వేడుకల్లో పాల్గొన్న సినీ నటుడు శివాజి*

**విశాఖపట్నం, ఏప్రిల్ 7, ప్రభాతవార్త**




ప్రపంచంలోనే గొప్ప విశ్వవిద్యాలయంగా ఆంధ్ర విశ్వవిద్యాలయం నిలవాలని విశాఖ పార్లమెంట్ సభ్యులు ఎం. శ్రీ భరత్ అన్నారు. ఏయూ శతాబ్ది ఉత్సవాలలో భాగంగా ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న మెగా కల్చరల్ ఫెస్ట్ రెండవ రోజు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్లమెంట్ సభ్యులు ఎం. శ్రీ భరత్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయాలు నూతన జ్ఞానాన్ని సృష్టించే కేంద్రాలుగా నిలవాలని. మంచి పౌరులను తయారు చేయాలని అన్నారు. విద్యార్థులు స్వీయ ఆలోచనలను కలిగి ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో భాగంగా వేదికపై ఏయూ విద్యార్థుల ప్రదర్శించిన నృత్యాలు. సాంస్కృతిక కార్యక్రమాలను అభినందించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్న తరుణంలో తాను ఇక్కడ పార్లమెంటు సభ్యునిగా ఉండటం, ఈ కార్యక్రమంలో భాగస్వామి కావడం తనకు ఎంతో సంతోషాన్ని, సంతృప్తిని ఇచ్చిందన్నారు. మిగతా 8..లో

## మృతురాలు ఒకరే.. మృతురాలు డెత్ సర్టిఫికెట్లే రెండు!

- *ఆస్తులు కాజేసేయత్నం జీవీఎంసీలో అవినీతి మత్తులో చిత్ర విచిత్రాలు*

**విశాఖపట్నం, ఏప్రిల్ 7, ప్రభాతవార్త**

జీవీఎంసీలో కొందరు సిబ్బంది అవినీతి మత్తులో చిత్ర విచిత్రాలు చేసేస్తున్నారు కేటుగాళ్లు నకిలీ పత్రాలు సృష్టించి జీవీఎంసీ సిబ్బంది సాయంతో ఏకంగా ఆస్తులే రాయించేసుకుంటున్నా.. అధికారులు గుర్తించలేకపోతున్నారు. జీవీఎంసీ సిబ్బంది సహకారంతో నకిలీ జనన/మరణ ధృవీకరణ పత్రాలు సృష్టించడం విశాఖలో కలకలం రేపింది. 11ఏళ్ల క్రితమే కేజీహెచ్ లో మృతి చెందిన ఒక వృద్ధురాలి పేరిట 2024లో మరో డెత్ సర్టిఫికెట్ తో పాటు అసలు ఆమె పేరిట అప్పటికే లేని ఆధార్ కార్డును సృష్టించి అక్రమ మార్గంలో ఆస్తులమ్మేసేందుకు ప్రయత్నించిన ఒక వ్యక్తిపై చర్యలు చేపట్టాలంటూ అక్కయ్యపాలెంలోని లలితానగర్ కి చెందిన ఎం. చిన్ని శ్రీదేవి అనే మహిళ అధికారుల్ని ఆశ్రయించారు. తన తల్లి పేరిట జరిగిన అన్యాయాన్ని స.హ చట్టం ద్వారా వెలికి తీయించి, ఈ సంఘటనకు కారణమైన మున్సిపల్ కార్పొరేషన్ బాధ్యులపై చర్యలు చేపట్టాలంటూ ఆమె జీవీఎంసీ కమిషనర్ ను ఖిపీజీఆర్ఎస్ఖి ద్వారా ఆశ్రయించారు. శానిటరీ అధికారులు ఏం చేస్తున్నట్టు?జోన్4, జీవీఎంసీ పరిధిలోని శ్రీనివాసనగర్1 (యూ), 2186240సచివాలయ ప్రాంతంలో ఒక నకిలీ డెత్ సర్టిఫికెట్ వ్యవహారం వెలుగు చూసింది. అక్కయ్యపాలెంనకు చెందిన కోరుబిల్లి అచ్చియ్యమ్మ అనే వృద్ధురాలు ఆగస్టు 1, 2013న కేజీహెచ్ లో మృతి చెందారు. ఈ మేరకు జీవీఎంసీ సిబ్బంది అప్పట్లో డెత్ సర్టిఫికెట్ కూడా మంజూరు చేశారు. వాస్తవానికి అచ్చియ్యమ్మకు ఎం.చిన్ని శ్రీదేవి ఏకైక సంతానం. మిగతా 8..లో


## త్వరలో అందుబాటులోకి ఈఎస్ఐ సేవలు

- *90శాతం పనులు పూర్తి షిలానగర్*
- *ఆసుపత్రి పనుల పరిశీలనలో ఎమ్మెల్యే పల్లా, ఎంపీ శ్రీభరత్*

**గాజువాక, ఏప్రిల్ 7, ప్రభాతవార్త**

పారిశ్రామిక ప్రాంత కార్మికులకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా షిలానగర్‌లో నిర్మిస్తున్న ఈఎస్ఐ ఆసుపత్రి పనులు తుది దశకు చేరుకున్నాయి. మంగళవారం గాజువాక ఎమ్మెల్యే, తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్‌తో కలిసి ఆసుపత్రి నిర్మాణ పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సుమారు 6.45 ఎకరాల విస్తీర్ణంలో రూ.400 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఈ అత్యాధునిక ఆసుపత్రి భవన పనులు ఇప్పటికే 90 శాతం పూర్తయినట్లు వారు వెల్లడించారు. నాణ్యతలో రాజీ పడొద్దు...పనుల నాణ్యత, సమయపాలనపై అధికారులతో సమీక్షించిన ఎమ్మెల్యే పల్లా, ఎక్కడా రాజీ పడకుండా పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. వచ్చే రెండు నెలల్లోపు అన్ని హంగులతో సిద్ధం చేసి, ప్రజలకు సేవలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వైద్య సిబ్బందికి అవసరమైన వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కార్మికులకు భరోసా... ఈ సందర్భంగా ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ.. "అత్యాధునిక సదుపాయాలతో కూడిన ఈ ఆసుపత్రి అందుబాటులోకి వస్తే గాజువాకతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లోని కార్మిక వర్గాలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది" అని పేర్కొన్నారు. నిర్మాణ పనుల్లో ఎటువంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని, నిర్ణీత గడువులోగా ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.





# ఐపీఎల్‌తో ఎలమంచిలిలో కోట్ల బెట్టింగ్ దందా.!

- వెంకటాపురం, పెద్దపల్లి, పట్టణంలో ఆన్‌లైన్ పందేల కలకలం
- చిన్న మొత్తాలతో మొదలై లక్షలు.. కోట్లకు చేరుతున్న లావాదేవీలు
- బెట్టింగ్ ఆడుతూ కొందరు ఆర్థికంగా బలపడుతున్నారన్న చర్చ
- యువతను ఆకర్షిస్తున్న ఈజీ మనీ మాయాజాలం
- క్రికెట్ బెట్టింగ్లపై ప్రత్యేక నిఘా అవసరం

**ఐపీఎల్ ఉత్సాహం వెనుక ఎలమంచిలిలో మరో చీకటి ఆర్థిక వ్యవస్థ నడుస్తోందా..? మ్యాచ్ టాస్ నుంచి చివరి ఓవర్ వరకు ఆన్‌లైన్ పందేలు సాగుతుండగా, కొందరు కోట్ల రూపాయల వరకూ సంపాదిస్తున్నారన్న ప్రచారం స్థానికంగా కలకలం రేపుతోంది. అదే సమయంలో సులువైన డబ్బు ఆశతో యువత బెట్టింగ్ వలలో చిక్కుకుని నష్టాల బారిన పడుతున్నారన్న ఆందోళనలు పెరుగుతున్నాయి.**

**(ఎలమంచిలి, ప్రభాతవార్త)**

ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపీఎల్) సీజన్ ప్రారంభం కావడంతో క్రికెట్ అభిమానుల్లో ఉత్సాహం కనిపిస్తున్నప్పటికీ, అదే సమయంలో ఎలమంచిలి మున్సిపాలిటీ పరిధిలో ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ కార్యకలాపాలు మళ్లీ చురుకుగా మారుతున్నట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది. ముఖ్యంగా వెంకటాపురం, పెద్దపల్లి, ఎలమంచిలి పట్టణ పరిధిలో కొందరు వ్యక్తులు మొబైల్ యాప్‌లు, ప్రత్యేక లింకులు, కోడ్ ఐడీల సాయంతో పందేలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. మ్యాచ్ ప్రారంభానికి ముందే టాస్‌పై మొదలయ్యే బెట్టింగ్, తొలి ఓవర్, పవర్‌ప్లే, వికెట్లు, స్కోరు, చివరకు మ్యాచ్ ఫలితం వరకు సాగుతోంది. మొదట చిన్న మొత్తాలతో ఆడిన కొందరు తర్వాత పెద్ద మొత్తాలకు వెళ్లి లక్షల రూపాయల లావాదేవీలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. స్థానికంగా కొందరు వ్యక్తులు క్రికెట్ బెట్టింగ్ ద్వారా భారీగా సంపాదించి ఆర్థికంగా బలపడినట్లు ప్రచారం జరుగుతోంది. కొన్ని సంవత్సరాల క్రితం సాధారణ జీవితం గడిపిన వారు ప్రస్తుతం ఖరీదైన వాహనాలు, కొత్త ఇళ్లు, అధిక నగదు లావాదేవీలతో కనిపించడం చర్చనీయాంశమవుతోంది. బెట్టింగ్‌లో మధ్యవర్తులుగా వ్యవహరించి, ఇతరులకు ఐడీలు అందించి కమిషన్లు పొందుతున్న వారూ ఉన్నట్లు సమాచారం. చిన్న మొత్తాలతో ప్రారంభమైన ఈ వ్యవస్థలో ఓడిపోయినవారు అప్పుల పాలవుతుండగా, రేట్లు అంచనా వేసి పందేలు కలిపే కొందరు మాత్రం భారీగా లాభపడుతున్నారనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. మ్యాచ్‌లపై ముందస్తు అంచనాలు, బుకీలతో ప్రత్యక్ష సంబంధాలు, అనేక అకౌంట్ల వినియోగంతో కొందరు కోట్ల రూపాయల వరకూ మిగతా 8..లో

# రైతుల్లో ల్యాండ్ టైటలింగ్ యాక్టు ప్రకంపనలు

- రూ.700 కోట్ల ప్రచారం
ఖర్చుతో రెండు మెడికల్ కాలేజీల నిర్మించవచ్చు
- పాస్‌బుక్‌ల పంపిణీ కార్యక్రమంలో గంటా విమర్శలు



**ఆనందపురం, ఏప్రిల్ 7, ప్రభాతవార్త**

క్యూఆర్ కోడ్ స్కానింగ్ తో హద్దులు సహా మొత్తం భూమి వివరాలు తెలిపే పాస్ బుక్ ను రాజముద్రతో ప్రభుత్వం అందిస్తుందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చెప్పారు. ఆనందపురం మండలం మామిడిలోవ పంచాయతీలో మంగళవారం నవీకరించిన పట్టాదార్ పాస్ పుస్తకాలు ఆయన రైతులకు పంపిణీ చేశారు. పొరపాట్లు లేని పాస్ పుస్తకాలను ఆయా భూ యజమానులకు ప్రతి నెల అందిస్తున్నామన్నారు. వైసీపీ హయంలో జగన్మోహన్ రెడ్డి తీసుకువచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేసిందని పేర్కొన్నారు. పట్టాదార్ పాస్ బుక్ లు, సర్వే రాళ్ల పై ఫోటోల కోసం జగన్మోహన్ రెడ్డి రూ. 700 కోట్ల వృధా ఖర్చు చేశారని, ఆ సొమ్ముతో 2 మెడికల్ కాలేజీలు, 10 హైస్కూల్స్ నిర్మించవచ్చని తెలిపారు. వారసత్వంగా వచ్చిన భూమి పత్రాలంటే రైతులకు సెంటిమెంట్ అని, జగన్ వారి మిగతా 8..లో

# ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన కూటమి ప్రభుత్వలక్ష్యం



- విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు మతుకుమిల్లి శ్రీభరత్

**విశాఖపట్నం, ప్రభాతవార్త**

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన అందించడం కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు మతుకుమిల్లి శ్రీ భరత్ అన్నారు. విశాఖ ఉత్తర నియోజకవర్గంలోని ఎన్.జి.జి.ఓ కాలనీలో ఉన్న జి.వి.ఎమ్.సి ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా బాల్యం సెంటర్‌ను సందర్శించి చిన్నారులతో ఆత్మీయంగా ముచ్చటిస్తూ వారి విద్యా అభ్యాసంపై వివరాలు తెలుసుకున్నారు. తదుపరి పాఠశాలను సందర్శించిన ఎంపీ, విద్యార్థుల ప్రతిభను పరిశీలించడంతో పాటు వారికి అందుతున్న విద్యా సౌకర్యాలపై సమీక్ష నిర్వహించారు. మధ్యాహ్న భోజన పథకం నాణ్యతను పరిశీలించే క్రమంలో విద్యార్థులతో కలిసి భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. మిగతా 8..లో

# ఉద్యోగులు అంకిత భావంతో పనిచేయాలి


- నిర్దేశిత సమయంలోగా ప్రాజెక్టులు పూర్తిచేయాలి
- వియంఆర్‌డిఎ చైర్పర్సన్ ఎంవి ప్రణవ్ గోపాల్,
కమిషనర్ యన్ తేజ్ భరత్




**విశాఖపట్నం, ప్రభాతవార్త**

వియంఆర్‌డిఎ సాంకేతిక విభాగం అధికారులు, సిబ్బంది విధి నిర్వహణ పట్ల అంకిత భావంతో పని చేయాలని వియంఆర్‌డిఎ చైర్మన్ శ్రీ ఎం వి ప్రణవ్ గోపాల్ సూచించారు. మంగళవారం ఉదయం వియంఆర్‌డిఎ సమావేశ మందిరంలో ఇంజనీరింగ్ విభాగం అధికారులతో మెట్రోపాలిటన్ కమిషనర్ శ్రీ వితేజ్ భరత్‌తో కలిసి పనుల ప్రగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల కల్పన వంటి గురుతర బాధ్యతలను మిగతా 8..లో

### మెడ్‌టెక్ ఇన్‌క్యుబేషన్ సెంటర్ స్థాపనకు
# గీతంతో బి.ఎఫ్.ఐ ఒప్పందం

**విశాఖపట్నం, ప్రభాతవార్త**

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం మరియు బ్లాక్‌చెయిన్ ఫర్ ఇంపాక్ట్ (బిఎఫ్ఐ) సంస్థలు సంయుక్తంగా అత్యాధునిక మెడ్‌టెక్ ఇన్‌క్యుబేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేయడానికి అవగాహన ఒప్పందాన్ని మంగళవారం కుదుర్చుకున్నాయి. విశాఖపట్నంలోని గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చి(జిమ్‌సర్)ఆసుపత్రి ప్రాంగణంలో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. వైద్య రంగ అవసరాలకు సాంకేతిక పరిష్కారాలకు మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించడం తద్వారా వైద్య పరికరాల దిగుమతులపై భారతదేశం ఆధారపడటాన్ని తగ్గించడం ఈ కేంద్రం ప్రధాన ఉద్దేశ్యం. గీతం ప్రోవైస్ ఛాన్సలర్లు డాక్టర్ బి.గీతాంజలి, ప్రొఫెసర్ వై.గౌతమరావు సమక్షంలో గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్ మరియు బ్లాక్‌చెయిన్ ఫర్ ఇంపాక్ట్ (బిఎఫ్ఐ) సలహాదారు డాక్టర్ శ్వేతా జిందాల్ అవగాహన ఒప్పందం పై సంతకాలు చేశారు. అంతకు ముందు బిఎఫ్ఐ నిపుణులతో సమావేశం అయిన విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు, మిగతా 8..లో

## ఏపీలో కోర్టులు పెరుగుదలపై బీజేపీ చీఫ్ మాధవ్ హర్షం

**విశాఖపట్నం, ప్రభాతవార్త**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో న్యాయవ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం 96 కొత్త కోర్టులను ఏర్పాటు చేయడానికి ఆమోదం తెలిపిన నిర్ణయాన్ని బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షులు పీవీయన్ మాధవ్ హర్షం వ్యక్తం చేసారు. ఈ నిర్ణయం ద్వారా పెండింగ్‌లో ఉన్న కేసుల భారాన్ని తగ్గించడం తో పాటు ప్రజలకు వేగవంతమైన న్యాయం అందించే అవకాశం ఏర్పడుతుందన్నారు. న్యాయం అందుబాటులోకి రావడం ప్రజాస్వామ్యానికి అత్యంత కీలకం అని బీజేపీ భావిస్తుందని పేర్కొన్నారు. అదేవిధంగా, ఈ కోర్టుల స్థాపనతో సుమారు 1,700 పైగా ఉద్యోగ అవకాశాలు సృష్టించబడటం కూడా సానుకూల పరిణామం. యువతకు ఉపాధి అవకాశాలు పెరగడం రాష్ట్ర అభివృద్ధికి దోహదం చేస్తుందని తెలిపారు. రాష్ట్రంలో న్యాయ వ్యవస్థ మరింత సమర్థవంతంగా పనిచేసేలా ప్రభుత్వం మరిన్ని చర్యలు తీసుకోవాలని కోరారు.

## నేడు విశాఖకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి

- *ఏయూ శతాబ్ది వేడుకల్లో పాల్గొననున్న పవన్ కల్యాణ్*

**విశాఖపట్నం, ఏప్రిల్ 7, ప్రభాతవార్త**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ బుధవారం విశాఖ పట్నంలో పర్యటించనున్నారు. దీనిలో భాగంగా ఆంధ్ర విశ్వవిద్యాలయంలో నిర్వహించనున్న శతాబ్ది వేడుకల్లో, ఇతర కార్యక్రమాల్లో పాల్గొంటారు. మధ్యాహ్నం 03.15 గంటలకు మంగళగిరిలోని క్యాంప్ కార్యాలయం నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరి గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి 05.00 గంటలకు విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి రోడ్డు మార్గంలో ఆంధ్రా యూనివర్సిటీకి చేరుకుంటారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో నిర్వహించే "శతాబ్ది మహోత్సవ్ ఏయూ మెగా కల్చరల్ ఫెస్ట్ 2026" వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొంటారు. కార్యక్రమం అనంతరం ఆంధ్రా యూనివర్సిటీ నుంచి విమానాశ్రయానికి అక్కడ నుంచి విజయవాడ తిరుగు పయనమవుతారు. ఈ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం, పోలీసు శాఖ తగిన ఏర్పాట్లు పూర్తి చేశాయి.

## పాడేరు ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారిగా ఆదిత్యవర్మ నియామకం

- పీఓ శ్రీపూజను అల్లూరి జిల్లా జేసి రెగ్యులర్ చేస్తూ బదిలీ

**పాడేరు,ఏప్రిల్ 7, ప్రభాతవార్త:**




అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న తిరుమానిశ్రీ పూజ ఐఏఎస్‌ను అల్లూరి జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసారు. పాడేరు ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారిగా ఆదిత్యవర్మ ఐఏఎస్ 2022 బ్యాచ్ కుంబంధించి కేడర్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈయన మేఘాలయ సబ్ కలెక్టర్‌గా విధులు మిగతా 8..లో



## హైకోర్టు తీర్పు అమలు చేయాలి...

### తాత్కాలిక ఉద్యోగులకు న్యాయం చేయాలి

అచ్యుతాపురం, ఏప్రిల్ 7, ప్రభాతవార్త

దశాబ్దాలుగా తాత్కాలిక ప్రాతిపదికపై తక్కువ వేతనాలతో ఉద్యోగులతో పని చేయించడం శ్రమ దోపిడీకి సమానమని వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షులు చోడిపల్లి అప్పారావు పేర్కొన్నారు. తెలుగు గంగ ప్రాజెక్టు, మున్సిపల్ శాఖల్లో పనిచేస్తున్న తాత్కాలిక ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని గౌరవ ఏపీ హైకోర్టు డివిజన్ బెంచ్ న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ సులేందు సామంతతో కూడిన ధర్మాసనం ఇచ్చిన తీర్పును వైఎస్సార్ టీయూసీ స్వాగతించింది. తాత్కాలిక ఉద్యోగులతో రెగ్యులర్ ఉద్యోగుల మాదిరిగానే పని చేయించుకుంటూ తక్కువ వేతనాలు చెల్లించడం పట్ల హైకోర్టు తీవ్రంగా స్పందించింది. తాత్కాలికంగా దశాబ్దాల పాటు పనిచేసిన ఉద్యోగులను క్రమబద్ధీకరించాలన్న వారి అభ్యర్థనను తిరస్కరించిన ఏపీఏటీ ఉత్తర్వులను సవాలు చేస్తూ తెలుగు గంగ ప్రాజెక్టు, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలువురు ఉద్యోగులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యాలపై విచారణ జరిపిన ధర్మాసనం పిటిషనర్లకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి, అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్న దాదాపు 3 లక్షల ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, వివిధ శాఖలు మరియు పథకాలలో పనిచేస్తున్న లక్ష మంది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, అలాగే సుమారు 40 వేల ఎన్ఎంఆర్, కంటింజెంట్, పార్ట్‌టైమ్, డైలీవేజ్, హాస్టల్ డైలీవేజ్ ఉద్యోగులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. రెగ్యులరైజేషన్ జరిగే వరకు వారికి రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా వేతనాలు, సౌకర్యాలు కల్పించాలని కోరారు. అదేవిధంగా అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, వెలుగు వీవోఏలు, మెప్మా ఆర్పీలు, గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను కూడా నామమాత్రపు వేతనాలతో పనిచేయించడాన్ని ఖండించారు. వీరందరినీ కూడా రెగ్యులరైజ్ చేసి, సమాన వేతనాలు ఇవ్వాలని వైఎస్సార్" టీయూసీ" డిమాండ్ చేసింది.

## "గ్రామ పాలనలో బంగారు అధ్యాయం...

### సర్పంచుల సేవలకు ఘన గౌరవం"

అచ్చుతాపురం ఏప్రిల్ 7, ప్రభాతవార్త



వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అనకాపల్లి జిల్లా యలమంచిలి నియోజకవర్గం అచ్యుతాపురంలో నిర్వహించిన అభినందన సభ రాజకీయంగా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మునగపాక, అచ్యుతాపురం మండలాలకు చెందిన జడ్పిటిసిలు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో గ్రామ స్థాయిలో సంక్షేమ పాలనను బలోపేతం చేస్తూ, అభివృద్ధి పథకాలను సమర్థవంతంగా అమలు చేసి ఐదు సంవత్సరాల పదవీకాలాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న సర్పంచులను ఈ సందర్భంలో ఘనంగా సన్మానించారు. దుప్పితూరు మాజీ సర్పంచ్ శంకర్రావు అధ్యక్షతన జరిగిన ఈ సభ గ్రామ నాయకత్వానికి గౌరవం చాటింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వైఎస్ఆర్సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు, పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్ సర్పంచులను శాలువాలతో సత్కరించి అభినందించారు. ఆయన మాట్లాడుతూ, జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో గ్రామ సచివాలయ వ్యవస్థ, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్స్ వంటి విప్లవాత్మక కార్యక్రమాలు గ్రామీణ జీవన విధానాన్ని పూర్తిగా మార్చాయని అన్నారు. ప్రజల గుండెల్లో చోటు సంపాదించిన ఈ పాలనను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అచ్చుతాపురం జడ్పిటిసి లాలం రాంబాబు మాట్లాడుతూ, గ్రామ స్థాయి నాయకత్వమే పార్టీకి అసలైన బలమని, సర్పంచులు ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా పనిచేసిన తీరు ఆదర్శప్రాయమని కొనియాడారు. రాబోయే రోజుల్లో కూడా ఇదే నిబద్ధతతో పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అచ్యుతాపురం, మునగపాక మండలాల జడ్పిటిసిలు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, రెండు మండలాల నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొని సభను విజయవంతం చేశారు.

## అమెరికా దిగ్బంధనంపై సీపీఎం ఆగ్రహం

### క్యూబా కోసం అచ్యుతాపురం ముందడుగు

అచ్యుతాపురం, ఏప్రిల్ 7 ప్రభాతవార్త



అనకాపల్లి జిల్లా ఎలమంచిలి నియోజకవర్గం అచ్యుతాపురంలో క్యూబా దేశానికి మద్దతుగా మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో విరాళాల సేకరణ కార్యక్రమం నిర్వహించబడింది. అమెరికా విధిస్తున్న ఆర్థిక దిగ్బంధనం కారణంగా క్యూబా ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, వారికి తోడ్పాటుగా ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు పాల్గొని మాట్లాడుతూ, దశాబ్దాలుగా కొనసాగుతున్న ఆర్థిక ఆంక్షలు క్యూబా ప్రజల జీవన ప్రమాణాలను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయని విమర్శించారు. అంతర్జాతీయ సమాజం, ఐక్యరాజ్య సమితి సూచనలను పట్టించుకోకుండా అమెరికా సామ్రాజ్యవాద ధోరణితో వ్యవహరించడం అమా నుషమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆహారం, మందులు వంటి ప్రాథమిక అవసరాలకూ అడ్డంకులు సృష్టించడం ప్రపంచ శాంతికి విరుద్ధమని పేర్కొన్నారు. ప్రపంచానికి వైద్య సేవలు అందించడంలో ముం దుండే క్యూబా దేశం నేడు కష్టకాలాన్ని ఎదుర్కొంటోందని, అలాంటి సమయంలో ప్రతి ఒక్కరూ మానవతా దృక్పథంతో అండగా నిలవాలని కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. అచ్యుతాపురం ప్రజలు స్పందించి విరాళాలు అందిం చడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీపీఎం కన్వీనర్ ఆర్. రాము, మండల కమిటీ సభ్యులు కూండ్రపు సోమునాయుడు, సీనియర్ నాయకులు కర్రి అప్పారావు, చేపల తాతయ్యలు, కదారి అప్పారావు, రొంగలి లక్ష్మి, కాసులమ్మ, సదాశివ తదితరులు పాల్గొన్నారు. వీధి వీధి తిరుగుతూ విరాళాలు సేకరించగా, పార్టీ కార్యకర్తలు, స్థానిక ప్రజలు ఉత్సాహంగా పాల్గొని తమవంతు సహాయాన్ని అందించారు.

## అన్నా క్యాంటీన్ సందర్శించిన ప్రగడ నాగేశ్వరరావు...

### భోజనం చేస్తున్న వారితో సౌకర్యాలపై మాట్లాడుతున్న ప్రగడ నాగేశ్వరరావు

ఎలమంచిలి ఏప్రిల్ 07 ప్రభాతవార్త



పట్టణంలోని అన్నా క్యాంటీన్‌ను రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ ప్రగడ నాగేశ్వరరావు మంగళవారం పరిశీలించారు. అక్కడ భోజనం చేస్తున్న వారితో మాట్లాడుతూ అన్న క్యాంటీన్లో భోజనం వసతి సౌకర్యాలపై ఆరా తీశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో ఉన్న పేద ప్రజలకు కడుపునిండా అన్నం పెట్టాలని ఉద్దేశంతో స్వర్గీయ నందమూరి తారకరామారావు పేరుతో అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేసి పేద ప్రజలకు ఐదు రూపాయలతో కడుపు నింపుతున్నారని త్వరలోనే ఎలమంచిలి నియోజవర్గంలో మరో అన్న క్యాంటీన్ ఏర్పాటుకు ప్రభుత్వం ముందుకు వస్తుందని, ఇది ప్రజల ప్రభుత్వం అని, ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను అందించాలని ఉద్దేశంతో ఈ కూటమి ప్రభుత్వం ముందుకు వెళుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గొర్ల శివన్నారాయణ మూర్తి, జిల్లా ఉపాధ్యక్షులు కోటారు సాంబశివరావు, జిల్లా తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి దాడి రమేష్, క్లస్టర్ ఇంచార్జిలు బొద్దపు శ్రీనివాసరావు, కరణం రవికుమార్, తెలుగుదేశం పార్టీ పట్టణ పార్టీ ఉపాధ్యక్షులు దంట్ల వెంకటస్వామి, పండూరి శ్రీనివాసరావు, గొర్లె బాబురావు, బోద్ధపు నాగేశ్వరరావు, కరెడ్ల మల్లికార్జునరావు, పిల్ల గంగాధర్, కర్రీ వెంకటస్వామి, బొద్దపు అశోక్ పాల్గొన్నారు.

## మున్సిపాలిటీలో వార్డులు విభజనపై సమావేశమైన ఎమ్మెల్యే సుందరపు, ప్రగడ నాగేశ్వరరావు..



ఎలమంచిలి ఏప్రిల్ 07, ప్రభాతవార్త

పట్టణంలోని మున్సిపల్ కార్యాల యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు 25 వార్డుల నుండి 32 వార్డులకు పెంపు దిశగా ఎలమంచిలి మున్సిపాలిటీ అధికారులు కార్యాచరణను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్, రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ప్రగడ నాగేశ్వరరావు, బిజెపి నాయకులు మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ రాజు రెవెన్యూ సిబ్బంది టౌన్ ప్లానింగ్ సిబ్బందితో సమావేశ మయ్యారు. మున్సిపాలిటీలో ప్రస్తుతం ఉన్న 25 వార్డు నుండి 32 వార్డులను విభజించే ప్రక్రియలో భాగంగా ఏ వార్డును ఎంతవరకు సరిహద్దులు నిర్ణయించారు. వీడియో ద్వారా మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ రాజు ఎమ్మెల్యేకు నాయకులకు పూర్తి స్థాయిలో విశ్లేషించారు. ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ ప్రతి వార్డులోనూ సరి సమాన సంఖ్యలో ఓటర్లు ఉండే విధంగా హద్దులతో పూర్తిస్థాయిలో ప్రక్రియ చేపట్టాలని అధికారులకు సూచించారు. జనసేన పట్టణ పార్టీ అధ్యక్షుడు బోద్ధపు శ్రీనివాసరావు, తెలుగుదేశం పట్టణ పార్టీ అధ్యక్షుడు గొర్లె శివన్నారాయణ మూర్తి, పిఏసిఎస్ చైర్మన్ గోపి,జనసేన నాయకులు ఊటకూటి రమేష్ నాయుడు, కొటారు శ్రీనివాసరావు, కర్రీ ఝాన్సీ, కొటారు నరేష్, పిట్టా శ్రీనివాసరావు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కోటారు సాంబశివరావు, కరణం రవికుమార్, దాడి రమేష్,ఆడారి రమణబాబు, దంట్ల వెంకటస్వామి, బోద్ధపు శ్రీనివాసరావు, పండూరి శ్రీనివాసరావు, గొర్లె బాబురావు, బొద్దపు నాగేశ్వరరావు, కర్రీ వెంకటస్వామి, బిజెపి నాయకులు, పిట్టా దాసుబాబు, మల్ల కొండబాబు,నక్కా శివశంకర్, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి రెవెన్యూ అధికారి సిబ్బంది పాల్గొన్నారు.



## వేసవి సెలవుల్లో విద్యార్థులు, పిల్లల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి

### జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా విజ్ఞప్తి



అనకాపల్లి, ఏప్రిల్ 7, ప్రభాతవార్త

పరీక్షలు ముగిసి వేసవి సెలవులు ప్రారంభం కానున్న నేపథ్యంలో, విద్యార్థులు, చిన్న పిల్లల భద్రతపై తల్లిదండ్రులు ప్రత్యేక నిఘా ఉంచాలని అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా కోరారు. సెలవుల్లో సరదా కోసం పిల్లలు ప్రమాదకరమైన జలాశయాల వద్దకు వెళ్లకుండా చూడటం అత్యంత ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. మంగళవారం ఆయన కార్యాలయంలో పలు కీలక సూచనలు జారీ చేశారు. పిల్లలు సరదాగా ఈత కొట్టడానికి లేదా స్నానాల కోసం సమీపంలోని చెరువులు, బావులు, కాలువలు, సముద్ర తీరం నీటి కుంటల వద్దకు వెళ్లే అవకాశం ఉంటుంది. నీటి లోతు తెలియక, ప్రవాహ వేగానికి లోనై ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోయే ముప్పు ఉంది. కాబట్టి తల్లిదండ్రులు పిల్లలను ఒంటరిగా అటువైపు వెళ్లనివ్వకూడదు అని సూచించారు. పిల్లలు ఇంటి వద్ద ఉన్న సమయంలో వారు ఎక్కడికి వెళ్తున్నారు, ఎవరితో ఉంటున్నారు అనే విషయాలను తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలి. ముఖ్యంగా మధ్యాహ్నం వేళల్లో పిల్లలు బయటకు వెళ్లకుండా ఇళ్లలోనే ఉండేలా జాగ్రత్త పడాలి. జిల్లా పోలీస్ యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉంటుంది, ప్రజలు కూడా సహకరించాలని ఎస్పీ పిలుపునిచ్చారు. ఏదైనా అత్యవసర పరిస్థితిలో ప్రమాదం సంభవిస్తే వెంటనే డయిల్ 100/112 లేదా స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## కొరుప్రోలు గ్రామంలో ఈ శ్రమ్ కార్డులు పంపిణీ

ఎస్.రాయవరం, ఏప్రిల్ 7, ప్రభాతవార్త



మండలంలో కొరుప్రోలు గ్రామంలో మంగళవారం ఈ శ్రమ్ కార్డులను తాజా మాజీ ఎంపిపి కే.వెంకటలక్ష్మి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పింఛన్ పథకం కార్మికులు, చిరు వ్యాపారులకు ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు. ఈ పథకములలో చేరిన వారికి 60 సంవత్సరాలు దాటిన తర్వాత నెలవారి పెన్షన్ రూపంలో మీకు అందుతుందని, లబ్ధిదారులు ప్రీమియం నెలకు 55 రూపాయలు నుండి 200 రూపాయల వరకు వయసును బట్టి చెల్లించి ఈ పథకంలో చెరవచ్చునన్నారు. దగ్గరలో ఉన్న సిఎస్సి లేదా మీసేవ ద్వారా అప్లై చేసుకోవచ్చు అన్నారు. కార్మికులు ఈ పథకమును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పుట్టా సుధాకర్, పిఎసిఎస్ అధ్యక్షులు గుర్రం రామకృష్ణ, లేబర్ ఆఫీసర్ బాలకృష్ణ, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ అన్నపూర్ణ కాశీ విశ్వేశ్వర స్వామి వారి దేవాలయంకు విరాళములు



(ఎస్ రాయవర ప్రభాతవార్త)

మండలంలోని పెనుగొల్లు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ అన్నపూర్ణ కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణం కొరకు కీర్తిశేషులు కలిగట్ల రామ గోవిందం జ్ఞాపకార్థం 50వేల రూపాయలు విరాళం ధర్మావరం గ్రామానికి చెందిన సియ్యాధుల అచ్యుత్ కుమార్ (నాని) చేతుల మీదగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కలిగట్ల సతీష్ తెలుగుదేశం పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు బండి నాగేశ్వరరావు, ఆలయ కమిటీ సభ్యులు వెంకటరత్నం (బాబి) కొవ్వూరు చిన్న సత్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

## సాగుకు అండగా వంద రోజులు ప్రణాళిక..

### జలధార...జల హారతిలో పనులు గుర్తింపు

గొలుగొండ, ఏప్రిల్ 7, ప్రభాతవార్త



సాగునీటి సంఘాల ద్వారా వ్యవసాయ రంగాన్ని పూర్తిస్థాయిలో ఆధునీకరించే విధంగా 100 రోజులు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు ఎంపీడీవో ఉలబాల శ్రీనివాసరావు అన్నారు. మండలంలో ఉన్న సాగునీటి సంఘాల చైర్మన్ వైస్ చైర్మన్ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో నేను మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జలధార జల హారతి కార్యక్రమంలో భాగంగా వంద రోజులు ప్రణాళిక తయారు చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. ఈ వందరోజుల కార్యక్రమంలో 2026 27 సంవత్సరానికి ప్రస్తుత ఎన్ ఆర్ జి ఎస్ నిధుల నుండి తదుపరి విజి బీ రాంజీ చెరువుల అభివృద్ధి కాలువల ఆధునీకరణలకు ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. వంద రోజుల్లో పూర్తయ్యే పనులను గుర్తించి తగిన ఇష్టమేట్ సిద్ధం చేసి పనులు ప్రతిపాదించాలని సూచించారు. సాగునీరు ఎక్కడ వృధా కాకుండా నీరు పంట పొలాలకు చేరే విధంగా ఈ ప్రణాళిక ఉండాలని తగిన బడ్జెట్‌తో ప్రణాళిక పక్కాగా రూపొందించాలన్నారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ శాఖ సిబ్బంది, సాగునీటి సంఘాల చైర్మన్లు, పిఏసిఎస్ అధ్యక్షులు చిటికెల సాంబమూర్తి, మాజీ సర్పంచులు ఆదపురెడ్డి గోపాలకృష్ణ, తుపాకి డాం చైర్మన్ రాయపరెడ్డి నాగేశ్వరరావు, విప్పలపాలెం హైకోర్టు చైర్మన్ గొర్లి సత్యనారాయణ, ఈపిఓ సూర్యప్రభ, సంగాల డైరెక్టర్లు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## ప్రజా ఆరోగ్యం కోసం కలిసికట్టుగా పని చేద్దాం..

### డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ ఎస్తేరు రాణి



గొలుగొండ, ఏప్రిల్ 7 ప్రభాతవార్త

ప్రభుత్వ లక్ష్యాలను నిర్దేశించుకుని ప్రజా ఆరోగ్య కోసం కలిసికట్టుగా పాటుపడతామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ ఎస్తేరు రాణి సిబ్బందికి సూచించారు. గొలుగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ర్యాలీలో ఆమె పాల్గొని అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న అధినాతన వైద్య రంగంలో ప్రజల ఆరోగ్యానికి ప్రాముఖ్యత కల్పించాలని, అందుకు అనుగుణంగానే సిబ్బంది స్థానిక పరిస్థితులను మలుచుకోవాలన్నారు. విజ్ఞానానికి అండగా నిలిచి ప్రజల ఆరోగ్యం కోసం పాటుపడతామన్నారు. అలాగే స్థానిక సిబ్బంది పనితీరు అందుతున్న వైద్య సదుపాయం, ఓపి నమోదు, మందుల లభ్యత, సిబ్బంది హాజరు, గ్రామాల్లో అందుతున్న సేవలు, ఆశా వర్కర్ల పనితీరు అంశాలపై సమీక్ష జరిపారు. కార్యక్రమంలో వైద్య అధికారులు డా.శ్యామ్ కుమార్, డాక్టర్ కీర్తి, సూపర్వైజర్ ఫకీర్ నాయుడు, ఏఎన్ఎంలు, సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## జిల్లాలో ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో 'నెట్ జీరో హెల్తీ క్యాంపస్ కార్యక్రమాలు

### జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్

అనకాపల్లి, ఏప్రిల్ 7,ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అన్ని ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో 'నెట్ జీరో హెల్తీ క్యాంపస్' అనే వినూత్న కార్యక్రమాన్ని చేపట్టిందని, అందులో భాగంగా జిల్లాలో 20 కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయాలలో ఈ కార్యక్రమాన్ని పైలట్ ప్రాజెక్ట్‌గా ప్రారంభించినట్లుగా జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ తెలిపారు. మంగళవారం ఉదయం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయాల ప్రిన్సిపాల్స్, సంబంధిత జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ హాస్టళ్లలో వ్యర్థాల నిర్వహణను మెరుగుపరచడం 'జీరో వేస్ట్' (వ్యర్థాలు లేకుండా చేయడం) లక్ష్యంగా పెట్టుకోవాలని కె.వి బిజీ ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. ఇప్పటికే కొన్ని చోట్ల కంపోస్ట్ పిట్లు, సోక్ పిట్లు, కిచెన్ గార్డెన్స్ వంటి పనులు ప్రారంభమయ్యాయని, జూన్ 2026 నుండి జూలై 2027 మధ్యలో ఈ పనులన్నీ పూర్తి చేసి, క్యాంపస్‌లను 'నెట్ జీరో'గా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ శాఖ, జిల్లా అధికారులు కెజిబివి పాఠశాలల ప్రిన్సిపాళ్లు కీలక పాత్ర పోషించాలన్నారు. కిచెన్ వ్యర్థాల నుండి ఎరువును తయారు చేసేలా డీకంపోజింగ్ యూనిట్లు చెత్త సేకరణకు టూ-బిన్ విధానాన్ని అమలు చేయ డం, వర్షపు నీటి సంరక్షణ ద్వారా భూగర్భ జలాలను రీఛార్జ్ చేయడం మురుగు నీటి నిర్వహణకు సోక్ పిట్స్ ఏర్పాటు చేయడం, విద్యార్థులకు సురక్షితమైన తాగునీరు, పరిశుభ్రమైన వంటశాలలు మరుగుదొడ్ల సౌకర్యం కల్పించడం అంటే అంశాలపై సమీక్షించారు. సౌరశక్తి వినియోగం , నీటి సంరక్షణ కూడా ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా ఉండనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో సమగ్ర శిక్ష జి సి డి వో, ఏ ఎస్ డి జమీమా, డిహెచ్ఓ ఏ రాజశేఖరమ్, సోషల్ ఫారెస్ట్ డీఎఫ్ ఓ సోమ సుందరన్, కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయాల ప్రిన్సిపాల్స్, సమగ్ర శిక్ష డిఈ లు సుబ్బలక్ష్మి, గణేష్, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.






## సీఎం రమేష్‌ను కలిసిన యూనిట్ ఇంచార్జ్ అందుకూరి ప్రసాద్

(రాంబిల్లి ఏప్రిల్ 07 ప్రభాతవార్త)



రాంబిల్లి మండలం మూలజంప గ్రామానికి చెందిన టిడిపి యూనిట్ ఇంచార్జ్ అందుకూరి ప్రసాద్ అనకాపల్లి క్యాంప్ కార్యాలయం నందు పార్లమెంట్ సభ్యులు సీఎం రమేష్ ని పలు అభివృద్ధి పనులపై కలిసి వినతి పత్రం అందజేశారు, మూలజంప గ్రామంలో ఎస్సీ కాలనీ మరియు గొల్ల వీధికి తాగునీటి సమస్య తీవ్రంగా ఉండడంతో ఒక బోరు మరియు వాటర్ ట్యాంక్ మంజూరు చేయాలని, ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకునే విధంగా రజకులకు ఒక సామాజిక భవనాన్ని మంజూరు చేయాలని, గ్రామ ప్రజల సహకారంతో నిర్మిస్తున్నటువంటి శివాలయం మండపానికి నిధులు మంజూరు చేయాలని వినతి పత్రం ఇవ్వడం జరిగిందని ఆయన అన్నారు, వినతి పత్రం తీసుకున్న సీఎం రమేష్ సానుకూలంగా స్పందించి త్వరలోనే నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారన్నారు, ఈ కార్యక్రమంలో గ్రామస్తులు కూడా పాల్గొన్నారు.

## అనకాపల్లిలో వడగళ్లతో భారీ వర్షం

### నేలకొరిగిన భారీ హోర్డింగ్లు -అంధకారంలో అనకాపల్లి పట్టణం -స్తంభించిన జనజీవనం

అనకాపల్లి రూరల్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త



అనకాపల్లిలో మంగళవారం సాయంత్రం భారీ ఈదురు గాలులతో వడగళ్లతో కూడిన భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు అధిక ఉష్ణోగ్రతతో ఉన్న వాతావరణం మధ్యాహ్నం మూడు గంటల నుండి ఉన్నపలంగా మేఘాలు కొమ్ముకొని వాతా వరణం చల్లబడి ఈదురు గాలులతో వడగల్లుతో కూడిన వర్షం కురిసింది. దీంతో పట్నంలో ఉన్న భారీ హోర్డింగులు నేలకొరిగాయి. విద్యుత్తుకు అంతరాయం ఏర్పడింది. స్థానిక రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద వర్షం నీరు భారీగా చేరడంతో చోడవరం అనకాపల్లి వెళ్లే మార్గంలో వాహనాలకు అంతరాయం ఏర్పడింది. లక్ష్మీదేవి పేట రైల్వే ట్రాక్‌పై నుండి వాహనాలు రాకపోకలు సాగించడంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. పట్నంలోని విద్యుత్తుకు అంతరాయం కలగడంతో అంధకారం నెలకొంది. వ్యాపార సంస్థలన్నీ మూతపడ్డాయి. జనజీవనం స్తంభించింది.

## ప్రపంచ ఆరోగ్య దినోత్సవ సందర్భంగా వైద్య విజ్ఞాన అవగాహన సదస్సు



అనకాపల్లి ఏప్రిల్ 7 ప్రభాతవార్త

ప్రపంచ ఆరోగ్య దినోత్సవ సందర్భంగా అనకాపల్లి పూడిమడక రోడ్‌లో వున్న సూర్య తేజ హెల్త్ కేర్ అధినేత భీమరశెట్టి మాణిక్య రత్నం ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం వైద్య విజ్ఞాన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో న్యూరో సర్జన్ డాక్టర్ ఎం.జగదీష్, హెడ్ నెక్ సర్జరీ, అంకలజిస్ట్ డాక్టర్ కే.ధీరజ్,రేడియేషన్ అంకాలజీ డాక్టర్ ఎం.వెంకట రమణలు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ ప్రాథమిక దశలో కేన్సర్‌ను గుర్తిస్తే నివారణ సులభం అవుతుంది. అదేవిధంగా 3,4స్టేజ్‌లో కూడా ఇప్పటి వైద్య శాస్త్ర అభివృద్ధి వలన అసాధ్యం కాదు అన్నారు.గ్రామీణ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు జంగం జోషి మాట్లాడుతూ కేన్సర్ పై చక్కటి అవగాహన కల్పించిన వైద్యులకు కృతజ్ఞతలు, హోస్ట్ మాణిక్య రత్నం కు అభినందనలు తెలిపారు.తమ సంస్థ తరుపున సహకారం వుంటుంది అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు తిరుమలరావు, చిరంజీవి, ప్రకాష్, అలక రాజు, వీరభద్రరావు, రమేష్, రమణారావు, శివ, తదితరులు పాల్గొన్నారు.

## వడ్డాది గ్రామంలో మజలీకి తప్పని కష్టాలు...

బుచ్చయ్య పేట ఏప్రిల్ 7 ప్రభాత వార్త



గ్రామీణ ప్రాంతాల్లో మజలీ నిర్వహణలో ఎదురవుతున్న కష్టాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. వడ్డాది గ్రామంలో ఇటీవల జరిగిన సంఘటనలు ఈ సమస్యను మరోసారి వెలుగులోకి తీసుకొచ్చాయి. గ్రామస్థులు చెబుతున్న వివరాల ప్రకారం వడ్డాది కొత్తూరు కస్పా కాలువ దగ్గర స్మశాన వాటిక ఉంది.మజలీ నిర్వహణకు అవసరమైన వసతులు సరైన విధంగా లేకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శుభ్రత, మరియు రవాణా వంటి అంశాల్లో లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.ఈ విషయంపై గ్రామ పెద్దలు స్పందిస్తూ, సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ ఇప్పటివరకు సరైన పరిష్కారం రాలేదని తెలిపారు. వెంటనే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం మరియు స్థానిక సంస్థలు తక్షణమే స్పందించి, అవసరమైన సదుపాయాలు కల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## అమరావతి రాజధానికి చట్టబద్ధత ప్రజల కళ్ళల్లో ఆనందం



### మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీష్

అనకాపల్లి ఏప్రిల్ 7,ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధ రాజధానిగా రాష్ట్రపతి ఆమోదిస్తూ గజట్ నోటిఫికేషన్ విడుదల చేసినందుకు ప్రధాని మోడీ హోం శాఖ మాత్యులు అమిత్ షా భారత రాష్ట్రపతి ముర్మి కు మాజీ శాసనమండలి సభ్యులు బుద్ధ నాగ జగదీశ్వరరావు మంగళవారం పార్టీ కార్యాలయంలో ప్రధాని నరేంద్ర మోడీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ విద్య ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కు పాలాభిషేకం చేస్తూ బాణాసంచి వెలిగించి కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా కార్యకర్తలను ఉద్దేశించి నాగ జగదీష్ మాట్లాడుతూ ప్రపంచంలోనే 197 దేశాలకు రాజధానులు ఉన్నాయని, మన దేశంలోని ప్రతి రాష్ట్రానికి రాజధాని ఉందని, కానీ ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఒక్కసారి ఓటు వేసినందుకు రాష్ట్రాన్ని విధ్వాంశం చేస్తూ పంచభూతాలను మింగేసి, ప్రభుత్వ ఆస్తులు తాకట్టు పెట్టి 12 సంవత్సరాలుగా రాజధాని లేని రాష్ట్రంగా కుట్రలు కుతంత్రాలు చేస్తూ మూడుముక్కలాటాడుతూ రాష్ట్రాన్ని ఆర్థికంగా అధోగాతిపాలు చేసిన జగన్ రెడ్డికి ఆంధ్రప్రదేశ్ గురించి మాట్లాడే హక్కు లేదని నాగ జగదీష్ అన్నారు. ఈ కార్యక్రమంలో కోట్ని రామకృష్ణ, కుప్పిలి జగన్, సాలాపు నాయుడు, పొలిమేర నాయుడు, కొరిబిల్లి మహాలక్ష్మి నాయుడు, కొమ్మొజు రామకృష్ణ, కాండ్రేగల వెంకట సూరి, ఎలమంచిలి బంగారు రాజు, పెంటకోట వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## పెంటకోటలో సిడబ్ల్యూసి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం

పాయకరావుపేట రూరల్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త




ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సంద ర్భంగా మంగళవారం మండలంలోని పెంటకోటలో సిడబ్ల్యూసి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం జరిగింది. గ్రామంలోని తుఫాన్ బిల్డింగ్ వద్ద ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ మెగా వైద్య శిబిరంలో డాక్టర్ పివి శ్రీనివాస్ వైద్య బృందం డాక్టర్ ఎస్ రాజీవ్ కుమార్, డా.కె సరోజ తదితరులు గ్రామంలోని పేదలు, చిన్న పిల్లలకు వైద్య సేవలందించారు. ఉచితంగా మందులు, రొట్టెలు, రస్కుల పేకెట్స్ పంపిణీ చేశారు. ఆరోగ్యం ఎలా కాపాడుకోవాలి అనే విషయంపై పలు సలహాలు, సూచనలు అందజేశారు. సుమారు 200 మందికి పైగా పాల్గొని ఉచితంగా మందులు తీసుకొన్నారు. ఈ కార్యక్రమంలో సిడబ్ల్యూసి ట్రస్ట్ అధ్యక్షులు సాదే రాజుబాబు, సెక్రెటరీ ఎస్ ప్రభురాజ్, టీడీపీ సీనియర్ నాయకులు చిక్కాల శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

